నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

11 హైదరాబాద్, గురువారం 15 ఫిబ్రవరి 2024 HYDERABAD






నల్గొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు.

-కంటోన్మెంట్, ఫిబ్రవరి 14

## ప్రేమికుల రోజు..
### ఇందిరాపార్కుకు తాళం

ప్రేమికుల రోజు సందర్భంగా పార్కుల్లో ప్రేమ జంటలు కనిపిస్తే పెండ్లిండ్లు చేస్తామని వీహెచ్‌పీ, బజ్‌రంగ్ దళ్ నేతలు ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బుధవారం ఇందిరాపార్కును బల్దియా అధికారులు మూసివేశారు.

-కవాడిగూడ, ఫిబ్రవరి 14



## పర్యటనలకు.. ఎమ్మెల్యేలను
# పిలుస్తలేరు

**ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గాల్లో కమిషనర్ పర్యటనలు**

**మేయర్ లేకుండానే జోనల్ సమీక్షలు**

**వివాదాస్పదంగా రోనాల్డ్ రాస్ వైఖరి**

**వివరణ కోరిన గద్వాల్ విజయలక్ష్మి**

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : బల్దియాలో ప్రోటోకాల్ వివాదం రాజుకుంటున్నది. పార్టీలకు అతీతంగా జీహెచ్ఎంసీ కార్యకలాపాలను ముందుండి నడిపించాల్సిన కమిషనర్ రోనాల్డ్ రాస్.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ.. నిబంధనలను తుంగలో తొక్కుతున్నారంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ఆయనపై మండిపడుతున్నారు. ఇప్పటికే పాలకమండలి, స్టాండింగ్ కమిటీ ఎన్నికల విషయంలో కమిషనర్ వైఖరిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా, వెంటనే కమిషనర్ దిగొచ్చి.. ఈ నెల 19న కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే తాజాగా రెండు అంశాల్లో కమిషనర్ వైఖరి వివాదాస్పదమైంది. ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పరిష్కారంతో పాటు పురోగతిలో ఉన్న పనులను పరిశీలించేందుకు వివిధ నియోజకవర్గాల్లో కమిషనర్ పర్యటిస్తున్నారు. అయితే పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలకు కనీస సమాచారం లేకుండా నియోజకవర్గాల్లో కమిషనర్ వచ్చి వెళ్లడం ఎంత వరకు సమంజసమని పలువురు మండిపడుతున్నారు. నియోజకవర్గ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అవగాహన ఉంటుందని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో కమిషనర్ భాగస్వామ్యం చేసుకోవాలని సూచిస్తున్నారు. జూబ్లీహిల్స్, ఎల్బీనగర్‌లో కమిషనర్ పర్యటన తర్వాత ఈ చర్చ తీవ్ర రూపం దాల్చింది. ఇదే క్రమంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న జోనల్ సమీక్షలు చర్చనీయాంశంగా మారాయి. జోనల్ కమిషనర్లు గడిచిన కొన్ని రోజులుగా ఆయా జోనల్ పరిధిలో ఉన్న కార్పొరేటర్లతో కలిసి సమీక్షలు జరుపుతున్నారు. ఇందులోనూ ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం ఉన్నది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి వారి అధ్యక్షతన జోనల్ సమీక్షలు జరపాలి. కానీ ఇందుకు విరుద్ధంగా ప్రక్రియ సాగుతున్నది. ఇప్పటికే శేరిలింగంపల్లిలో మేయర్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా కార్పొరేటర్లతో జోనల్ కమిషనర్ సమీక్షలు జరిపారు. బుధవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సైతం డివిజన్ కార్పొరేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలను కమిషనర్ ఆదేశాల మేరకు జరుపుతున్నామని జోనల్ కమిషనర్లు చెబుతున్నారు. ఈ విషయంపై మేయర్ స్పందించి కమిషనర్‌ను వివరణ కోరారు. స్పెషల్ ఆఫీసర్ పాలన తరహాలో కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ..ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల పట్ల ఆయన వైఖరి సరిగా లేదంటూ.. పలువురు పేర్కొంటున్నారు.

## బల్దియాకు 8 మంది
# మున్సిపల్ కమిషనర్లు

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా 74 మున్సిపల్ కమిషనర్లను సర్కారు బదిలీ చేసింది. అందులో భాగంగా ఎనిమిది మందిని బల్దియాకు కేటాయించారు. వీరిలో అధికారులు ఎ. శైలజ, ఎ. సుజాత, సీహెచ్ నాగేశ్వర రావు, డి. సుభాశ్‌రావు, జి. వేణుగోపాల్ రెడ్డి, మహ్మద్ షేక్, ఎస్. విద్యాధర్, వి. సమ్మయ్య ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాల మేరకు సొంత జిల్లాలు, మూడేండ్ల కంటే ఎక్కువ రోజులు అదే స్థానంలో ఉన్న అధికారులను బదిలీ చేస్తున్నారు.



## రాచకొండ కమిషనర్‌గా..
# తరుణ్ జోషి బాధ్యతలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనర్‌గా నియమితులైన తరుణ్ జోషి.. బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, సైబర్‌నేరాల కట్టడికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

# బల్దియాలో ఫేస్ రికగ్నిషన్..

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో ఇక మీదట ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ద్వారానే విధులకు హాజరుకానున్నారు. కమిషనర్ నుంచి పారిశుద్ధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరూ రోజు వారీ విధులకు హాజరయ్యే ముందు ఆయా కార్యాలయాల వద్ద ఫేస్ రికగ్నిషన్ చేయనున్నారు. ఇప్పటికే కార్వాన్‌లో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైంది. దీంతో త్వరలోనే జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



# శ్రీ వీణా శారదగా..

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 14 : వసంత పంచమిని పురస్కరించుకొని.. సైనిక్‌పురి శృంగేరి శంకరమఠంలో కొలువైన శ్రీ శారదాంబ అమ్మవారిని శ్రీవీణా శారదగా అలంకరించారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు.



కార్తిక్

## అదృశ్యమై..
# శవమై..

నాలాలో బాలుడి మృతదేహం గుర్తింపు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14: అదృశ్యమైన బాలుడు నాలాలో శవమై కనిపించాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మునావత్ తండాకు చెందిన మునావత్ రమేశ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని దుర్గాభవానీ నగర్ బస్తీలో ఉంటున్నాడు. అతడికి భార్య కవితతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. చిన్న కొడుకు మునావత్ కార్తిక్(10) మంగళవారం రాత్రి ఇంట్లోంచి ఆడుకునేందుకు బయటకు వెళ్లి.. తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా.. ప్రయోజనం లేకపోవడంతో అర్ధరాత్రి తల్లి కవిత జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ పుటేజీలను పరిశీలించడంతో పాటు సమీప ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో పోలీసులు బుధవారం బస్తీకి సమీపంలో నిరుపయోగంగా ఉన్న జీహెచ్ఎంసీ పార్కు స్థలంలోని నాలాలో కార్తిక్ మృతదేహాన్ని గుర్తించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి క్లూస్ టీమ్స్‌తో ఘటనా స్థలికి వచ్చి ఆధారాలు సేకరించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



మహ్మద్ సాదిక్ అలీ (ఫైల్)

## రాంగ్‌రూట్..
# అతివేగం..

**బైక్‌ను ఢీకొట్టిన కారు**

**ఎక్సైజ్ సీఐ దుర్మరణం..**

మన్సూరాబాద్/చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 14: రాంగ్ రూట్‌లో వచ్చిన కారు..బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్సైజ్ సీఐ దుర్మరణం పాలయ్యారు. ఎస్సై తీవ్రంగా గాయపడ్డారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా నర్కేట్‌పల్లికి చెందిన మహ్మద్ సాదిక్ అలీ (40) ప్రస్తుతం మలక్‌పేటలో నివాసముంటున్నారు. చార్మినార్ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా వలీ మొయినుద్దీన్(52)తో కలిసి సాదిక్ అలీ మంగళవారం రాత్రి ఎల్బీనగర్ నుంచి మూసారాంబాగ్‌కు బైక్‌పై వెళ్తుండగా, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం సమీపంలో రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాదిక్ అలీ చనిపోగా, మొయినుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి కారు వదిలి పారిపోయాడు. కాగా, మహ్మద్ సాదిక్ అలీ భౌతిక కాయానికి ఆయన నివాసంలో పలువురు పోలీసులు అధికారులు, బంధువులు నివాళులర్పించారు.

## మరో నాలుగు రోజులే..
# బుక్‌ఫెయిర్

**బుధవారం భారీగా తరలివచ్చిన సందర్శకులు**

సిటీబ్యూరో/ కవాడిగూడ, ఫిబ్రవరి 14 ( నమస్తే తెలంగాణ ) : ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన బుక్‌ఫెయిర్ ఈనెల 19తో ముగియనున్నది. మరో నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో బుధవారం సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, తంగేడుకుంట హెబ్బర్ నాగేశ్వర రావు రచించిన 'విద్యకు విముక్తి' పుస్తక ఆవిష్కరణ రవ్వా శ్రీహరి వేదికపై జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ చమర్తి ఉమామహేశ్వర రావు, బొప్ప భాస్కర్ పాల్గొన్నారు. అమృత రాజ్ రచించిన పిలుపు పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్నీ కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత ఓల్గా అనువాదం చేసిన 'హమీద్ దల్వాయ్' కథల పుస్తకాన్నీ ఉనుదుర్తి సుధాకర్ ఆవిష్కరించారు. శాస్త్రీయమైన స్వార్థ్యకారక దివ్యసంకల్పాలు' పుస్తకాన్ని స్వామి ప్రజ్ఞానంద ఆవిష్కరించారు. రవ్వా శ్రీహరి వేదికపై హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన పగిడిపాల ఆంజనేయులు రాసిన 'హృదయ రాగం' పుస్తకాన్ని ప్రముఖ సినీ దర్శకుడు నర్సింగ్ రావు ఆవిష్కరించారు. రవ్వా శ్రీహరి వేదికపై కే. ఆనంద చారి అధ్యక్షతన 'నేటి సామాజిక పరిణామం-రచయితల స్పందన'పై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నర్సయ్య ,రచయితలు ఎన్ వేణుగోపాల్, జూపాక సుభద్ర, బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



'హృదయ రాగం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు బి. నర్సింగ్ రావు, బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు




ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీసీపీ జానకి

# పట్టపగలే.. దోచేశారు

**కత్తితో బెదిరించి..గాయపరిచి..**

**బంగారు నగల దుకాణంలో దోపిడీ**

**150 గ్రాముల ఆభరణాలతో ఉడాయింపు**

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 14: పట్టపగలే బంగారు ఆభరణాల దుకాణంలో భారీ దోపిడీ జరిగింది. దుండగులు కత్తితో బెదిరించి.. గాయపరిచి..సొత్తు దోచుకొని పారిపోయారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, బాధితుల కథనం ప్రకారం.... అక్బర్‌బాగ్ చౌరస్తాలోని కిష్వా జ్యూవెల్లర్స్ దుకాణంలో బుధవారం యజమాని మహ్మద్ ఉల్ రహమాన్ తన కుమారుడు సజావల్ రహమాన్‌ను దుకాణంలో ఉంచి.. భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి.. బంగారు గొలుసు కావాలని అడిగాడు. సజావల్ రహమాన్ గొలుసు చూపిస్తుండగా, అతడు ఒక్కసారిగా కత్తితో గాయపరిచాడు. అంతలోనే మాస్క్.. హెల్మెట్ ధరించిన మరో ఇద్దరు వ్యక్తులు దుకాణంలోకి చొరబడ్డారు. 150 గ్రాముల ఆభరణాలను దోచుకొని నిందితులు పారిపోయారు. ఘటనాస్థలికి సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ, మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. నిందితులు నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చినట్లు గుర్తించారు. గాయపడిన సజావుల్ రహమాన్‌ను దవాఖానకు తరలించారు. నిందితులను పట్టుకునేందుకు ఎనిమిది బృందాలు గాలిస్తున్నాయి.

## అక్రమాలకు పాల్పడితే
# సహించేది లేదు

**పోలీస్ అధికారులు..సిబ్బంది చట్టప్రకారం నడుచుకోవాలి**

**కిందిస్థాయిలో న్యాయం జరగకపోతే..**

**బాధితులు నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయొచ్చు**

**నమస్తేతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి**



సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): 'పోలీసు అధికారులు, సిబ్బంది, ఫిర్యాదుదారుల పట్ల పారదర్శకంగా వ్యవహరించాలి. చట్ట ప్రకారం నడుచుకోవాలి. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులే వాటిని ఉల్లంఘిస్తే ఎలా...ప్రజలకు న్యాయం చేసినప్పుడే..పోలీసులంటే నమ్మకం పెరుగుతుంది. సిబ్బంది..అధికారులు.. ఏ స్థాయి వారైనా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా.. అవకతవకలకు పాల్పడినా.. ఏకపక్షంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై కఠినంగానే వ్యవహరిస్తాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం'. అని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి హెచ్చరించారు. సైబరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టి నెలరోజులు పూర్తయిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. అవేమిటో ఆయన మాటల్లోనే..

### సాంకేతిక పరిజ్ఞానంతో..

విజుబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేశాం. సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, నివారణ చర్యలు చేపడుతున్నాం. ఐటీ, టెక్నికల్, న్యాయ నిపుణుల సహకారంతో సైబర్‌క్రైమ్ పోలీసులు సైబర్ నేరాలను ఛేదిస్తున్నారు. ఒక జనవరిలోనే 40 సైబర్‌క్రైమ్ కేసులు ఛేదించి సుమారు రూ.1,49,41,670 మొత్తాన్ని నేరస్తుల నుంచి రికవరీ చేసి, బాధితుల ఖాతాల్లో జమ చేశాం. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

### డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి



కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం . మత్తు పదార్థాలు గ్రాము పరిమాణంలో లభించినా.. కఠినంగానే వ్యవహరిస్తాం. ముఖ్యంగా డ్రగ్స్ వల్ల యువత చెడుదారిపడుతున్నది. అందుకే మాదకద్రవ్యాల నివారణ కోసం స్పెషల్ ఆపరేషన్ టీమ్(ఎస్‌వోటీ) ప్రత్యేకంగా పనిచేస్తున్నది.

### అధికారులు స్పందించకపోతే..

స్థానిక పోలీస్ స్టేషన్లలో అధికారులు స్పందించకపోతే ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలి. వారి వద్ద కూడా న్యాయం జరగకపోతే బాధితులు నేరుగా సీపీకి ఫిర్యాదు చేయవచ్చు. స్థానిక అధికారులను సంప్రదించకుండా నేరుగా కమిషనర్ కార్యాలయానికి రావొద్దు. కింది స్థాయి, మధ్యస్థాయి అధికారుల వద్ద సమస్య పరిష్కారం కానప్పుడు సీపీని సంప్రదించాలి.

# రెంటల్ కార్లు.. తనఖా పెట్టి..

దుండిగల్: రెంట్‌కు కార్లు తీసుకొని.. వాటిని తనఖా పెట్టి.. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నాడో వ్యక్తి. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజాంపేట్‌లోని యూనివర్సల్ కార్స్ ట్రావెల్స్ బిజినెస్ నిర్వాహకుడు సయ్యద్ ఖాజా హబీబ్ అన్సారీ వద్ద తమిళనాడు రాష్ట్రం, కృష్ణగిరి మండలం హొసూర్ గ్రామానికి చెందిన గోపాల్ రవి(46) గతేడాది ఏప్రిల్ 27న రెండు కార్లను నెలవారీగా కిరాయికి లక్షా 40 వేల చెల్లించి తీసుకున్నాడు. మరో రెండు నెలల తర్వాత మరో కారును రూ. 40 వేలు నెల కిరాయి చెల్లించి తీసుకున్నాడు. ఆ తర్వాత రెంట్ డబ్బులు కట్టకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. నిర్వాహకుడు కారుకు ఉన్న జీపీఎస్ ఆధారంగా తమిళనాడుకు వెళ్లి.. గోపాల్ రవిను డబ్బులు అడిగాడు. అతడు కార్లు తనఖా పెట్టాడని తెలుసుకొని.. తాను మోసపోయానని గ్రహించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, గోపాల్‌ను తమిళనాడులో అరెస్టు చేశారు.



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు